క్లుప్తంగా

ప్రారంభమైన మంచాలమ్మ జాతర


అలంకరణలో మంచాలమ్మ

రామాపురం : మండలంలోని రాచపల్లె పంచాయతీ గంగనేరులో వెలసిన శ్రీ మంచాలమ్మ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. కొవ్వూరి వంశస్తుల ఇలవేల్పు శ్రీ మంచాలమ్మ మొదటిగా వారి వంశస్తులు విశేష పూజలు, మొక్కులు, పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు, తలనీలాలను సమర్పించుకున్నారు. పలు గ్రామాల నుండి అమ్మవారికి చాందినీ బండ్లు, కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నూతన నియామకం

లక్కిరెడ్డిపల్లె : జాతీయ చేతివృత్తుల జిల్లా అధ్యక్షులుగా వీరబల్లి వెంకటరమణను నియమించినట్లు జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికారున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేతి వృత్తులు చేసే ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి వాటిని పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని వెంకట రమణ తెలియజేశారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి


కార్మికులకు నగదు అందజేస్తున్న దాత

నందలూరు : పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కళాబంధు చిక్కాల బాలాజీరావు కొనియాడారు. బాలాజీ రావు సతీమణి కీ.శే.చిక్కాల జయలక్ష్మి జ్ఞాపకార్థం నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు 17 మందికి నూతన వస్త్రాలు కొనుగోలు నిమిత్తం ఒక్కొక్కరికి రూ. 1000లు నగదును సర్పంచ్ సూర్యనారాయణ, దాత చిక్కాల బాలాజీరావుల చేతులమీదుగా స్థానిక లైబ్రరీ వద్ద ఆదివారం అందజేశారు.

వైభవంగా జ్యోతి ఉత్సవాలు


దర్శనమిస్తున్న చౌడేశ్వరీ దేవి

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని బి.ఎర్రగుడి గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి జ్యోతి ఉత్సవాలను ఆది, సోమవారం భక్తుల కోలాహలం నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకుని అమ్మవారికి రెండు రోజుల పాటు విశేషంగా పూజలు చేశారు. మొక్కులు ఉన్న భక్తులు చౌడేశ్వరమ్మ పూజలు చేయించారు. అనంతరం గ్రామంలో జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయానికి చేరి తల్లిని దర్శించుకున్నారు.

ఘనంగా పల్లమ్మ తల్లి జాతర


జాతరలో పాల్గొన్న భక్తులు

పెనగలూరు : మండలంలోని ఎస్ఆర్ పురం పంచాయతీ పల్లంపాడు గ్రామం వద్ద కొలువైన పల్లమ్మ తల్లి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. నూతనంగా నియమితులైన ఆలయ చైర్మన్ నరసింహులు ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆదర్శ రైతుగా ధర్మారెడ్డి


కలెక్టర్ చేతులమీదుగా అవార్డును అందుకుంటున్న ధర్మారెడ్డి

గాలివీడు : విశ్వావసు నామ సంవత్సరం, ఉగాది పర్వదినం సందర్భంగా మండలానికి చెందిన గీదర ధర్మారెడ్డి అన్నమయ్య జిల్లా ఉత్తమ ఆదర్శ రైతు అవార్డును కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతులమీదుగా అందుకున్నారు. ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమం ఈ అవార్డు అందుకున్నట్టు సోమవారం ఇక్కడి విలేకరులకు తెలియజేశారు.

ఉపాధి బిల్లులు చెల్లించండి

నిమ్మనపల్లె : ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలని మాల మహానాడు జిల్లా కార్యదర్శి వీరనాల మాణిక్యం కోరారు. మూడు నెలలుగా ఉపాధి హామీ కూలీలకు బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక్క బిల్లు కూడా పడక పోవడంతో జీవనం సాగించడం కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వాలు వెంటనే స్పందించి కూలీలకు బకాయిలను జమ చేయాలని కోరారు.

శాంతి, సమైక్యతకు ప్రతీక రంజాన్

ఘనంగా ఈద్గా, మసీదుల్లో ఈద్ ఉల్ ఫిత్ర్ ప్రార్థనలు

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు సోమవారం ఉదయాన్నే స్నానమాచరించి నూతన దుస్తులు ధరించి ప్రత్యేక ప్రార్థనల కోసం పెద్దఎత్తున ఈద్గాలు, మసీదులకు వెళ్లడంతో ఎటుచూసినా రంజాన్ సందడి కనిపించింది. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇస్లాం మతగురువులు ఈదుల్ ఫిత్ర్ విశిష్టతను తెలియజేశారు. ముస్లింలు ఒకరినొకరు అలింగనం చేసుకొని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాయచోటిలో జరిగిన ప్రార్థనల్లో మైనార్టీ నాయకులతో కలసి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేటలో ఎమ్మెల్యే ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా, రైల్వేకోడూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదిలావుంటే పలుచోట్ల ముస్లింలు కేంద్రం తీసుకువస్తున్న వక్ఫ్ అమెండ్మెంట్ బిల్లును నిరసిస్తూ చేతికి నల్లబ్యాడ్జిలు ధరించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థనలు పూర్తయ్యాక వక్ఫ్ బచావో.. దేశ్ బచావో అంటూ నినాదాలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


రాయచోటి: ఈద్గా వద్ద ఈద్-ఉల్-ఫిత్ర్ ప్రార్థనలలో పాల్గొన్న ముస్లింలు


ఓబులవారిపల్లె: మసీదులో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు


రాయచోటి: ప్రార్థనలలో పాల్గొన్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి


రామాపురం: మోహన్‌రెడ్డిని కలిసిన నీలకంఠ్రావుపేట మైనార్టీలు


రాయచోటి: ప్రార్థనలలో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


రాజంపేట టౌన్: దువా చదువుతున్న దృశ్యం


చిన్నమండెం: రంజాన్ సందేశం వింటున్న ముస్లిం సోదరులు


సిద్దవటం: ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


రైల్వేకోడూరు అర్బన్: ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు


చిట్వేలి: రంజాన్ సందేశాన్ని తెలియజేస్తున్న ఇమామ్


వీరబల్లి: శుభాకాంక్షలు తెలుపుతున్న వీఆర్‌డీఎస్ సురేందర్‌రెడ్డి


నందలూరు: రంజాన్ సందేశాన్ని తెలియజేస్తున్న ఇమామ్


సంబేపల్లె: శెట్టిపల్లె గ్రామంలో ముస్లింల అలింగనం


పెనగలూరు: ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు


సుండుపల్లె: రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు


లక్కిరెడ్డిపల్లె మండలం రెడ్డివారిపల్లె ఈద్గా వద్ద


గాలివీడు: ఇమామ్ సందేశాన్ని వింటున్న ముస్లిం సోదరులు

ఘనంగా అవధూత బత్తులయ్య ఆరాధనోత్సవాలు


అవధూత బత్తులయ్య స్వామి ఆలయం


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : అవధూత బత్తులయ్య స్వామి 284వ ఆరాధనోత్సవాలను ఉగాదిని పురస్కరించుకొని ఆయన భక్తులు, నిర్వాహకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని శేషమాంబపురం పంచాయతీలోని బాలిరెడ్డిగారిపల్లి గ్రామంలో ఆదివారం వేకువజాము నుంచి సోమవారం వేకువజాము వరకు ఈ వేడుకలను జరిపారు. ఆరాధనోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలను విద్యుత్ వెలుగులతో నింపారు. అదే విధంగా బత్తులయ్య సమాధిని వివిధ రంగుల పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ పురోహితులు పిండిబోయిన పెద్దరెడ్డెయ్య ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు చేశారు. పలువురు భక్తులు చాందినీ బండ్లు కట్టి భక్తిని చాటుకున్నారు. పూజల్లో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆకేపాటి మురళీరెడ్డిలతో కలసి వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

ఇరుముడి కట్టిన ఆకేపాటి

హరిపుత్రుడు అయ్యప్పస్వామి దీక్షను ఈ నెల 3వ తేదీన చేపట్టిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి సోమవారం ఇరుముడి కట్టించుకొని శబరిమలలోని స్వామి దర్శనార్థం బయలుదేరారు. రాజంపేట అయ్యప్పస్వామి దేవస్థానం ఆలయ ప్రధాన అర్చకులు కొత్తపల్లి రాఘవేంద్ర స్వామి, కొండా సత్యనారాయణ గురుస్వాములు అయ్యప్ప శరణములు వల్లి వేస్తూ ఇరుముడి కట్టినారు. కార్యక్రమంలో నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి


చిన్నమండెం: నడివీధి గంగమ్మకు పూజలు చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : నడివీధి గంగమ్మ తల్లి దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నమండెం మండలం పొలిమేరపల్లెలో నడివీధి గంగమ్మ దేవర సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఇచ్చిన విందులలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు గావించారు. పొలిమేరపల్లెలో వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, నాయకులు, కార్యకర్తలు వట్టం కృష్ణారెడ్డి, ఆనంద్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, చంద్రపాల్ తదితర కార్యకర్తల నివాసాలకు వెళ్లిన శ్రీకాంత్‌రెడ్డికి ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ లోకేశ్వరరెడ్డి, నాగశేషారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ చుక్కా అంజన్న, భాస్కర్‌నాయుడు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రామాపురం: గ్రామోత్సవంలో పాల్గొన్న గడికోట

రామాపురం : మండలంలోని ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో కొలువైన శ్రీ చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు సోమవారం నాటి గ్రామోత్సవంతో జ్యోతులతో ఘనంగా ముగిశాయి. అమ్మవారికి పట్టువస్త్రాలతో పూలమాలలతో విశేషంగా అలంకరించారు. ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏకవీరమ్మ.. కనికరించమ్మ


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఓబులవారిపల్లె : ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని జిల్లేల మడగ వడ్డిపల్లి గ్రామంలో కొలువైన ఏకవీరమ్మ జాతర సోమవారంతో వైభవంగా ముగిసింది. ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం రాత్రి గ్రామ దేవత ఏకవీరమ్మ మండల కేంద్రం పరధిలోని గ్రామాల్లో ఊరేగించారు. భక్తులు కాయా, కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. వడ్డిపల్లి గ్రామంలో ఏకవీరమ్మ గుడి వద్ద పెద్దఎత్తున ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన పుష్పాలతో మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పొంగుబాళ్లు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. అలానే ముక్కవారిపల్లి పంచాయతీ కొర్లకుంట అడ్డరోడ్డు వద్ద ఉప్పలపాటి గంగమ్మ జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు.

అలరించిన సంకీర్తనలు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ గుహేశ్వరీ పశుపతినాథ ఆలయంలో సోమవారం రాత్రి అన్నమయ్య సంకీర్తనలు నిర్వహించారు. అన్నమయ్య కీర్తనలతో పాటు హరికథ కాలక్షేపం భక్తులను అలరింపజేశాయి. భాగవతార్ అనుసూయ, గాత్రం రెడ్డమ్మ, తపల తిప్పయ్య, వయోలిన్ విజయకుమార్, కళాకారులు భక్తులను పరవశింపజేశారు. భక్తులు పశుపతి నాథుడిని దర్శించుకుని సంకీర్తనల కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

జయాపజయాలను సమానంగా స్వీకరించాలి


టోర్నీ ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నందలూరు : క్రీడాకారులు జయాపజయాలను సమానంగా స్వీకరించాలని రైల్వే మెడికల్ ఆఫీసర్ జయభాస్కర్ రావు, ఎస్ఐ శ్రీధర్, ఏఎస్ఐ మోజెస్‌లు సూచించారు. నందలూరు రైల్వే కేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో స్మాషర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నమయ్య, కడప జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ (డబుల్స్) టోర్నమెంట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్రీడలను ఆడాలని, క్రీడలు వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో రైల్వే లోకో పైలెట్ పీఈకే మూర్తి, ప్రభుత్వ వైద్యులు హీరేందర్ సింగ్, రవిశంకర్, న్యాయవాది ముంగి మోహన్, మట్టిబాబు, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ అఖిల్, దినేష్, అభినవ్, రాము, రాఘవ, ఫరూక్, హర్ష పాల్గొన్నారు.

లింగం సంజీవ్‌కు అంబేద్కర్ సేనా రత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న లింగం సంజీవ్

రాజంపేట రూరల్ : మాలల అభ్యున్నతి కోసం నిరంతరం చేస్తున్న పోరాటాలు, ఉద్యమాలను గుర్తించి అంబేద్కర్ సేనా రత్న అవార్డు తనకు అందించినట్లు మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ్ సోమవారం తెలియజేశారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడు పాలెంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఉగాది పురస్కారాల మహోత్సవం నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ వేడుకలలో మాలల రాష్ట్ర ఉద్యోగుల సంఘం, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా తనకు ఈ అవార్డు అందజేసినట్లు తెలియజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా మాలల అభివృద్ధి కోసం ఎన్నో త్యాగాలు చేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా దళిత రత్న, మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యామల సుదర్శన్, మాలల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దాసరి చెన్నకేశవులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నిప్పులు కక్కుతున్న భానుడు.. నిర్మానుష్యంగా రోడ్లు

- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
- శీతల పానీయాలకు పెరిగిన డిమాండ్


కళింగర పండ్లు కొంటున్న ప్రజలు


నిర్మానుష్యంగా ఉన్న సిద్దవటంలోని ప్రధాన బస్టాండ్ రోడ్డు

సిద్దవటం : భానుడు నిప్పులు కక్కుతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే తన ప్రతాపం చూపెడుతున్నాడు. దీంతో వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రత 39 నుంచి 40 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. మరో రెండు నెలలపాటు ఎండలు, వడగాల్పులతో మరెన్ని ఇబ్బందులను ఎదుర్కోవాలోనన్న భయాందోళనకు ప్రజలు గురవుతున్నారు. బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు. రోడ్లన్నీ జనాలు లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలో ఇంకెలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముంచుకొస్తున్న తాగునీటి సమస్య

వేసవి కాలం అనగానే తాగునీటి సమస్య తలెత్తుతుంది. అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా తాగునీటి కోసం ప్రజల ఇక్కట్లు తప్పవు. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో ఇప్పటికే నీటి ఎద్దడి ముంచుకొచ్చింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శీతల పానీయాలకు గిరాకీ

ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలు సేవిస్తున్నారు. మజ్జిగ, కళింగర కాయలు, కొబ్బరి బోండాలకు గిరాకీ పెరిగింది. ఇదే అదునుగా వ్యాపారస్తులు ధరలను అమాంతంగా పెంచారని ప్రజలు వాపోతున్నారు. అలానే రద్దీ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేశాయి.

జాగ్రత్తలు పాటించాలి



వేసవి కాలం ముగిసేంత వరకు ప్రజలు జాగ్రత్తలు తప్పక పాటించాలి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, వడదెబ్బ తగలకుండా ఇంట్లోనే ఉండాలి. సాధ్యమైనంత వరకు నీడలోనే ఉండాలి. ఉదయం 10:30 గంటలలోపే పనులు ముగించుకొని ఇంటికి వెళ్లాలి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగరాదు. తప్పనిసరి అయితే వెంట గొడుగు తీసుకెళ్లాలి. మజ్జిగ, మంచీళ్లు బాగా తాగాలి.

– డాక్టర్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్, ప్రభుత్వ ఆసుపత్రి, సిద్దవటం